క్లుప్తంగా

అనంతేశ్వరునికి అన్నాభిషేకం



కడియపులంకలో అనంతేశ్వరునికి అన్నాభిషేకం చేస్తున్న దృశ్యం

కడియం: మండలంలోని కడియపులంకలో శ్రీఅపర్ణా సమేత అనంతేశ్వరాలయంలో శుక్ర వారం స్వామివారికి అన్నాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అర్చకులు కె.శ్రీనివాసశర్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చ నలు జరిపారు. అభిషేక ప్రసాదంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు. పెద్ద ఎత్తున నర్సరీ రైతులు, మహిళలు పాల్గొన్నారు.

యోగాంధ్ర ఏర్పాట్ల పరిశీలన



యోగాంధ్ర ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా ఉన్నతాధికారులు

కడియం: మండలంలోని కడియపులంకలో పుల్లా చంటియ్యకు చెందిన శ్రీసత్యదేవ నర్స రీలో శనివారం జరగనున్న యోగాంధ్ర ఏర్పా ట్లను జిల్లా ఉన్నతాధికారులు శుక్రవారం పరిశీ లించారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగాంధ్ర నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యం లో జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, ఏపీఎంఐపీ పీడీ దుర్గేష్, డీటీఓ వెంకటాచలం, డీహెచ్ఓ సుజా తకుమారి, తహసీల్దార్ సునీల్‌కుమార్, అసోసి యేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, నర్సరీ అధినేత పుల్లా పెద సత్యనారాయణలో కలసి ఏర్పాట్లపై సమీక్షించారు.

మసీదుల వద్ద నేడు ప్రత్యేక నిఘా



ఎస్పీ నరసింహకిశోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలోని ముస్లిం లకు ఎస్పీ డి.నర సింహకిశోర్ బక్రీద్ పండగ శుభాకాం క్షలు తెలిపారు. బక్రీద్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన మసీదులు, ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు, సోలార్ కెమెరాలు, డ్రోన్లతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో ముస్లిం సోదర సోదరీమణులు పండగ జరు పుకోవాలన్నారు. మతసామరస్యానికి భం గం కలిగించే విధంగా ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తప్పవన్నారు.

పార్కింగ్ ప్రదేశాల అభివృద్ధికి చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా నూతన పార్కింగ్ ప్రదేశాలను అభివృద్ధి చేస్తున్నట్లు కమిషనర్ కేతన్ గార్గ్ శుక్రవారం ప్రకటించారు. దీని కోసం 84 స్థలాలను గుర్తించినట్లు వెల్లడించారు. ఇం దులో కొన్ని ప్రభుత్వ స్థలాలు కాగా మిగతావి ప్రైవేట్ స్థలాలని అన్నారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలు, జంక్షన్ల వద్ద వీటిని ఏర్పాటు చేయడం ద్వారా ట్రాఫిక్ సమస్యను చాలా వరకూ తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. ఈ పార్కింగ్ ప్రదేశాలను అభివృద్ధి పరిచేందుకు డిప్యూటీ కమిషనర్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేశా మన్నారు. ఇందులో ఎంహెచ్ఓ, సిటీ ప్లానర్, ప్లానింగ్ ఆఫీసర్ (రుడా), ట్రాఫిక్ పోలీస్ విభాగానికి సంబంధించి ఓ ఉన్నతా ధికారి సభ్యులుగా ఉంటారన్నారు. ఇప్పటికే గ్రౌండ్ వర్క్ పూర్తికాగా త్వరలో టెండర్లను ఆహ్వానిస్తామన్నారు.

పర్యాటక ప్రాజెక్ట్‌కు 19న శంకుస్థాపన

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కేంద్ర ప్రభుత్వ సహకారంతో మంజూరైన ప్రతిష్టా త్మక అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు ఈ నెల 19న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎంపీ పురందేశ్వరీలు శంకుస్థాపన చేయను న్నారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాస్కి 2024–25 స్కీమ్ ద్వారా మంజూరైన రూ.97 కోట్లతో రాజమహేంద్రవరం, ధవళే శ్వరం, కడియం, కొవ్వూరు, నిడదవోలు తదితర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి పనులు చేస్తామని చెప్పారు. గోదావరి పుష్కరాలలోపే ప్రాజెక్టు పనులు పూర్తవు తాయని వెల్లడించారు.

నిర్లక్ష్యమే వారి అజెండా

- నాడు పచ్చదనం
- నేడు తుంచేస్తున్న వైనం
- నగరంలో ఎండిపోతున్న మొక్కలు



ఇనుప తీగలతో మొక్కలకు టీడీపీ జెండాలు కట్టి..



పుష్కరఘాట్‌లో ఎండిపోయిన సుందరీకరణ మొక్కలు

రాజమహేంద్రవరం సిటీ: చూడచక్కని నగరం.. రాజమహేంద్రవరం. నాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ సారథ్యంలో పచ్చదనంతో పరిఢవిల్లింది.. ఇప్పుడు కళావిహీనంగా మారుతోంది.. నేడు ఎండిపోతున్న మొక్కలతో ప్రాణం పోయినట్టు కనిపిస్తుంది.. మొక్కలను ప్రాణంగా చూడాల్సిన ఇప్పటి ప్రజాప్ర తినిధులే పచ్చ జెండాలు కట్టి తుంచేస్తున్నారు. టీడీపీ జెండాలను డివైడర్లపై మొక్కలకు కట్టి ఎక్కడకక్కడే వంచేస్తున్నారు. ఇదంతా అధికారుల ఎదుటే జరుగుతున్నా ఇటువైపు ఎవరూ చూడకపో వడం శోచనీయం. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ తదితరులంతా మొక్కలు నాటి హడావుడి చేస్తుంటే, రాజమహేంద్రవరం నగరంలో ఎమ్మెల్యే మాత్రం అందంగా, ఆహ్లాదంగా పెరిగిన మొక్కల ప్రాణాలు తోడేస్తున్నారని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భర త్‌రామ్ విమర్శించారు. టీడీపీ మహానాడు, కూటమి ప్రభుత్వం ఏడాది పాలన ఉత్సవం పేరు చెప్పి నగరంలో ఎక్కడికక్కడే పార్టీ జెండాలు కట్టేశా రని, దీనికోసం మొక్కలను నాశనం చేస్తున్నార న్నారు. శ్రీశ్రీశ్రీ చినజీయర్ స్వామి చేతుల మీదుగా నగరంలో పచ్చదనం కోసం యువత–హరిత పేరుతో గత వైఎస్సార్ సీపీ పాలనలో వేలాది మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటడంతో పాటు దత్తత తీసుకుని పెంచేలా కార్యా చరణ రూపొందించారు. మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రూ.లక్షలు వెచ్చించి రోడ్ల పక్కన, డివైడర్లలో మొక్కలు నాటించారు. ఉవ్వెత్తున విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటడంతో అవి ఎంతో ఏపుగా పెరిగాయి. పచ్చదనం కోసం ప్రజా ధనం వెచ్చించి నాటిన మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యత ఇప్పటి ప్రజాప్రతినిధులు తీసుకోక పోవడం దారుణం. ఈ మొక్కలను సంరక్షించాల్సిం ది పోయి, వాటికి టీడీడీ జెండాలు కట్టి తద్వారా చనిపోయేలా చేస్తున్నారు. ఒకపక్క ఎండలు విపరీ తంగా పెరిగిపోయి, ఉష్ణోగ్రతలను తట్టుకోలేక ప్రజలు సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో మొక్కలను విస్తృతంగా పెంచాల్సింది పోయి, గతం లో వేసిన మొక్కలను బతకనీయకుండా చేస్తు న్నారు. పార్టీ జెండాలు కట్టుకోవడానికి మొక్కలను వాడడం సరికాదని సర్వత్రా అభిప్రాయం వ్యక్తమ వుతోంది. మొక్కలు పెంచాలని, రాష్ట్రాన్ని హరితాం ధ్ర ప్రదేశ్ చేయాలని ఒకపక్క సీఎం చంద్రబాబు ఉపన్యసిస్తుంటే, ఇక్కడ అంతా ఇష్టారాజ్యంగా వ్యవ హరిస్తున్నారు. దీనిపై ప్రజలు అధికారులకు చెబు తున్నా పట్టించుకోవడం లేదని పలువురు అం టున్నారు.

ఎక్కడ చూసినా ఇంతే..

కూటమి ప్రభుత్వం వచ్చాక మొక్కలను క్షోభ పెట్టేలా వ్యవహరిస్తూ పర్యావరణ స్ఫూర్తిని దెబ్బతీ స్తుంది. నగరంలో గోదావరి రేవులు అపరిశుభ్రం గా మారాయి. నిత్యం ఎంతోమంది గోదావరిలో పుణ్య స్నానాలకు దిగి నాచుతో ఇబ్బంది పడుతు న్నారు. దీనికితోడు రేవుల్లో చెత్త పేరుకుపోవడంతో స్నానం చేయడానికి నరకయాతన అనుభవిస్తు న్నారు. గోదావరి రేవులను శుభ్రం చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిర్లక్ష్య ధోరణి సరికాదు



నగరంలో మొక్కలు ఎండిపో యిన పరిస్థితిపై అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా సరైన చర్యలు చేపట్టడం లేదు. పర్యా వరణ పరిరక్షణకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు ఈ విధమైన నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం క్షమించరాని నేరం. ఇప్పటికైనా మొక్కల సంరక్ష ణకు దృష్టి సారించాలి. ప్రజాధనంతో చేపట్టిన సుం దరీకరణ మొక్కలను పూర్తి స్థాయిలో సంరక్షించాలి. ఈ విషయమై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తాం.

–మార్గాని భరత్‌రామ్, మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి



దెబ్బతింటున్న మొక్కలు



మొక్కకు తీగలు కట్టి..

సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్ పాఠశాలలు ఇవే

రాజమహేంద్రవరం రూరల్: మండలంలో ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ సిలబస్‌తో నడుస్తున్న యాజమాన్య పాఠశాలలు, వాటి తరగతులు వివరాలను మండల విద్యాశాఖాధికారి– 1 తులసీదాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ట్రిప్స్ ఇంటర్ నేషనల్ స్కూల్ సీబీఎస్ఈ (1నుంచి 10వ తరగతి), లోటస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ సీబీఎస్ఈ (1 నుంచి 10వ తరగతి), ఫ్యూచర్ కిడ్స్ ఇంగ్లిషు మీడియం స్కూల్ ఐసీ ఎస్ఈ (3 నుంచి 7వ తరగతి), ఆదిత్య తక్ష్ (ఇంగ్లిష్ మీడియం) స్కూల్ సీబీఎస్ఈ (1 నుంచి 10వ తరగతి)లకు మాత్రమే అనుమ తులు ఉన్నాయన్నారు. మరి ఏ ఇతర పాఠశా లలకు సెంట్రల్ సిలబస్ అనుమతులు లేవన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు 2025–26 విద్యాసంవత్సరానికి అనుమ తులు లేని పాఠశాలల్లో సెంట్రల్ సిలబస్ పేరుతో ఎవరైనా అడ్మిషన్లు తీసుకుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక దానవాయిపేటలోని రామదాసు సహ కార శిక్షణ కేంద్రంలో డిప్లమో ఇన్ కోఆపరే టివ్ మేనేజ్‌మెంట్ అండ్ కంప్యూటర్ అప్లికే షన్స్ (డీసీఎంఅండ్‌సీఏ) కోర్సుకు సంబం ధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ ప్రిన్సిపాల్ వెదురుపాక శ్రీనివాస్ ఓ ప్రక టనలో పేర్కొన్నారు. ఆరు నెలల కాల వ్యవధి ఈ కోర్సునకు దరఖాస్తు చేయడానికి సహకార సంఘ ఉద్యోగులు పదో తరగతి ఉత్తీర్ణత, ఇతరులు ఇంటర్ పాసై ఉండాల న్నారు. ఇతర వివరాలకు ప్రిన్సిపాల్ 92478 83491, లెక్చరర్ 99499 22395 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు



శిక్షణ తరగతులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సత్కారం

కడియం: స్థానిక శాఖా గ్రంథాలయంలో నలభై రోజుల పాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసిందని లైబ్రేరియన్ శెట్టిపల్లి శ్రీదేవినిర్మల తెలిపారు. శుక్రవారం స్థానిక గ్రం థాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సర్పంచ్ మోసిగంటి సత్యవతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరంలో భాగంగా విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు, ప్రముఖులు అడపా సుబ్రహ్మణ్యం, నీటి సంఘం అధ్యక్షుడు చిక్కాల ఈశ్వరరావు, పం చాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి, ఏఈఓ శం కర్, దేవవరపు నీలకంఠరావు, ఉప్పులూరి హను మంతరావు, ఆకుల సూర్యనారాయణ, బోణం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థు లకు ప్రశంసాపత్రాలు అందించారు. అడపా సుబ్ర హ్మణ్యం వాటర్ బాటిళ్లు బహూకరించారు.

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమ హేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మాజీ కార్పొరేటర్ కొమ్మా శ్రీనివా సరావు, ట్రస్టు కార్యదర్శి చలుమూరి సత్యనారా యణ మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాను విద్యా ర్థులు ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులు సెలవు రోజుల్లో గ్రంథాలయాలకు వచ్చి మంచి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. శిక్షణ తరగతులను నిర్వహించిన ఉపాధ్యాయు లను లైబ్రేరియన్ శ్రీదేవి సత్కరించి, బహుమతు లను అందజేశారు.. ట్రస్టు సభ్యులు రొంగల బాబు, సుబ్రహ్మణ్యం, తిరుపతి అప్పారావు, ఆది రెడ్డి శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో ఒత్తిడి దూరం



యోగా చేస్తున్న జేసీ చిన్నరాముడు తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నిత్య యోగా సాధ నతో ఒత్తిడిని దూరం చేయవచ్చని జేసీ చిన్నరాముడు అన్నారు. శుక్రవారం జిల్లా స్థాయిలో యోగా శిక్షణ కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల సమీపంలో గ్రాంట్ ట్రంక్ రోడ్డు వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ యోగా యొక్క ప్రధాన సూత్రం మనసు, శరీరం, హృదయాన్ని ఏకం చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. బ్రహ్మ కుమారి మాట్లాడుతూ యోగా సాధనను అలవా టుగా మార్చుకోవాలన్నారు.

జక్కంపూడిని విమర్శిస్తే ఊరుకోం

- అక్రమాలకు పాల్పడేది బత్తులే
- రాజానగరం వైఎస్సార్ సీపీ నాయకుల ఆగ్రహం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజానగరం: నియోజకవర్గంలో దోపిడీయే అజెం డాగా పని చేస్తున్న వ్యక్తి దోపిడీ గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టు ఉందని వైఎస్సార్ సీపీ మండల నాయకులు అన్నారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇకపై ఇలాంటి చర్యలను ఊరుకునేది లేదన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కోకన్వీనర్ గండి నానిబాబు, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆడబాల చినబాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, సీనియర్ నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, వేమగిరి కృష్ణ, మార్గాని శ్రీను తదితరులు మాట్లాడారు. ప్రజాసేవే పరమావధిగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే జక్కంపూడి కుటుంబం గురించి విమర్శించే అర్హత బత్తులకు లేదన్నారు. ప్రజలు ఓట్లు వేసి ఎమ్మె ల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని దోచుకుంటున్నారని అన్నారు. బినామీ పేర్లతో అక్రమాలకు పాల్పడేది ఎవరో జనాలకు తెలుసని అన్నారు. ఎదుటి వారిపై బురద జల్లడం బత్తుల నైజమైతే, జనం కోసం నిరం తరం పాటుపడే స్వభావం జక్కంపూడిదని తెలిపారు.

ప్రకృతి వనరులను దోచేస్తూ..

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజా సంక్షేమం , అభివృద్ధి జరగకపోవడంతో వైఎస్సార్ సీపీ నిర్వ హించిన వెన్నుపోటు దినానికి జనం నుంచి అపూర్వ స్పందన వచ్చిందన్నారు. వరాలు కురిపించిన దేవుడిని కాదనుకుని, రాక్షసులకు అధికారం ఇచ్చామని జనమంతా ఇప్పుడు గగ్గోలు పెడుతున్నా రన్నారు. నియోజకవర్గంలో ఇసుక, మట్టి, కొండలు, చెరువులు ఇలా.. ప్రకృతి వనరులను ఎమ్మెల్యే దోచేస్తున్నారని విమర్శలు చేశారు. ఎమ్మెల్యేగా గెలు పొందిన వెంటనే గోదావరి ర్యాంప్‌ల వద్ద ఉన్న ఇసుక నిల్వలను తరలించుకుపోయిన మీరు దోపిడీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అం తటితో ఆగకుండా నియోజకవర్గంలో కొండలపై పడ్డారని అన్నారు. ఇప్పుడు రైతుల పేరుతో చెరువు లను తవ్వేస్తున్నారన్నారు.

అసంపూర్తి పనులేలా..



రంగులు లేక వెలవెలబోతున్న కుసుమ నాగన్న స్కూల్

కంబాలచెరువు: మరికొద్ది రోజుల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. నగరం లో పాఠశాలల్లో నాడు– నేడు రెండో విడత పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఉన్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పాఠ శాలలను ఆధునీకరించారు. ప్రస్తుతం నాడు– నేడు పనులు ఇంకా పూర్తి చేయకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తి చేసినా, రంగులు వేయడం మరిచారు. కొన్ని స్కూళ్లలో సగం సగం పనులు చేశారు. మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న విద్యా సంవత్సరం నాటికైనా పనులు పూర్తి చేస్తే విద్యా సంవత్సరం రంగుల మయం తో ప్రారంభించవచ్చు. కోర్లమ్మపేటలోని కుసుమ నాగన్న ప్రాథమిక పాఠశాల పరిస్థితి అయితే చెప్పనక్కరలేదు. ఆ స్కూల్‌కు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు ప్రారంభించారు. అవి అసంపూర్తిగానే మిగిలిపోయాయి. మరి కొన్ని పాఠశాలలకు అయితే కిటికీలు సైతం వేయలేదు. స్థానిక బ్రాడీపేటలోని చందన నాగే శ్వరరావు నగరపాలక సంస్థ పాఠశాలలో పనులు పూర్తి కాలేదు. స్కూల్‌లో రెండు అదనపు తరగ తుల నిర్మాణ పనులు చేపట్టి, గదులకు కిటికీలు, తలుపులు బిగించడం మానేశారు.

మరమ్మతులు పూర్తి కావాలి



నాడు– నేడు రెండో దశలో కొన్ని పాఠశాలల్లో మరు గుదొడ్లు, అదనపు తరగతి గదుల నిర్మాణాలు, చిన్న మరమ్మతులు పూర్తి కావాలి. అవి అయ్యాక రం గులు వేయాలి. రంగులు అన్నింటికీ ఒకేసారి సెం ట్రల్ ప్రొక్యూర్మెంట్ ప్రాసెస్ ద్వారా జరుగుతుం ది. అది ఇంకా రాలేదు. దీనివల్ల ఆలస్యం అవు తోంది. స్కూల్స్‌లో నిలిచిపోయిన పనులపై పైఅ ధికారులకు నివేదిక అందించాం.

–బి.దిలీప్‌కుమార్, అర్బన్ రేంజ్ డీఐ, రాజమహేంద్రవరం

ప్లాస్టిక్ వాడకంపై కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో పబ్లిక్ హెల్త్ అధికారులతో సమీక్షిం చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నగ రంలో ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తు న్నామని, స్పెషల్ ఆఫీసర్లు తమ వార్డు పరిధిలో విస్తృతంగా పర్యటించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అమ్మే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల న్నారు. ప్లాస్టిక్ నిషేధానికి సంబంధించి మున్సి పల్, పోలీసు అధికారులతో కూడిన 5 శానిటేషన్ అండ్ హెల్త్ ఎన్ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినో త్సవాన్ని పురస్కరించుకుని ఈ బృందాలు పొల్యూషన్ కంట్రోల్ బోర్డుతో కలిసి పలు హోల్‌సేల్ దుకాణాలపై దాడులు నిర్వహిస్తు న్నాయని అన్నారు. పిడింగొయ్య ప్రాంతంలో వేం కటేశ్వర హోల్‌సేల్ మార్కెట్‌లో దాడులు నిర్వహిం చగా, సుమారు 2 టన్నుల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. రూ.12 లక్షల జరి మానా విధించామన్నారు.

విస్తృతంగా అవగాహన

మానవాళికి ప్రమాదకరంగా మారిన ప్లాస్టిక్‌ను వినియోగించడం ద్వారా జరిగే అనర్థాలపై ప్రజ లకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ వారి నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. వ్యాపార వర్గాలు, వినియోగదారులు తమకు సహకరించి నగర పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావే శంలో ఎంహెచ్ఓ ఎ.వినూత్న, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞానం... వినోదం

- ముగిసిన వేసవి విజ్ఞాన తరగతులు
- గ్రంథాలయాల్లో 40 రోజుల శిక్షణ



దానవాయిపేటలో శిక్షణ ముగింపు సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు, డ్రాయింగ్ బుక్స్ పంపిణీ

ప్రకాశంనగర్: వేసవి సెలవులను విద్యార్థులు సద్వి యోగం చేసుకునేలా గ్రంథాలయ శాఖ వేసవి విజ్ఞాన తరగతులను నిర్వహించింది.. సుమారు 40 రోజుల శిక్షణ శుక్రవారంతో ముగిసింది.. రాజమ హేంద్రవరంలోని గౌతమి ప్రాంతీయ గ్రంథాల యం, సీతంపేట, దానవాయిపేట గ్రంథా లయాల్లో ఏప్రిల్ 28 నుంచి ఈ తరగతులు ప్రారం భించారు. ఇందులో తెలుగు పద్యాలు, డ్రాయింగ్, చందమామ కథలు, శతక పద్యాలు, జనరల్ నాలెడ్జ్ వంటి అంశాలను వివరించారు. అలాగే వారంతపు పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థు లకు పలు బహుమతులు అందజేసి వారిని ప్రోత్స హించారు. ఈ విజ్ఞాన తరగతులు విద్యార్థుల అభ్యున్నతికి ఎంతగానో ఉపయోగపడతాయని గ్రంథాలయ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంటర్నెట్ ప్రభావం అధికంగా ఉండడంతో చిన్నారులు ఆన్‌లైన్ గేమ్‌లు, వ్యసనాల బారిన పడకుండా పుస్తక పఠనం ద్వారా విజ్ఞా నాన్ని అందించాలనే ఉద్దేశంతో ఏటా ఈ కార్య క్రమం చేపడుతున్నామన్నారు.

ప్రతి రోజు నాలుగు గంటలు..

ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడంలో తల్లిదండ్రుల సహకారం ఎనలే నిదని శిక్షకులు చెబుతున్నారు. చదివే సమయంలో ఒత్తిడిని దూరం చేసేందుకు యోగా, వివిధ ప్రము ఖుల జీవిత చరిత్రలతో పాటు ఒక మంచి పుస్తకం పై సమీక్ష వంటి విషయాలతో పాటు పేపర్‌తో బొ మ్మల తయారీ, గణిత శాస్త్రంలో పెన్ను, పేపర్ లేకుండా సులువైన పద్ధతిలో పలు మెళకువలు నేర్పించారు. ఎండ వేడి అధికంగా ఉండటంతో విద్యా ర్థులకు శిక్షణ తరగతుల్లో బ్రేక్ ఇచ్చి వారికి కావా ల్సిన మంచినీరు, స్నాక్స్ వంటివి ఉచితంగా అం దించడంతో ఆయా గ్రంథాలయాల్లోని శిక్షణ శిబిరాలు విద్యార్థులతో సందడి మారాయి. చివరి రోజైన శుక్రవారం శిక్షణ తరగతుల ముగింపు సంద ర్భంగా దానవాయిపేట మహిళా గ్రంథాలయంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు, డ్రాయింగ్ బుక్స్ అంద జేశారు.

మంచి స్పందన వచ్చింది



వేసవి శిక్షణ తరగతులకు విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చింది. చదువుతో పాటు ఇతర అంశాల్లో శిక్ష ణతో వారిలో సృజనాత్మకత, పోటీతత్వం పెరు గుతుంది. గణిత సూత్రాలు వాటి మెళకువలు, స్పోకెన్ ఇంగ్లిష్ వంటివి నేర్చుకోవడం వల్ల పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చు. నిష్ణాతులైన అధ్యాపకులతో పలు విభాగాల్లో అందించిన శిక్షణ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడింది.

–అబ్బిరెడ్డి చంద్ర పద్మాదేవి, దానవా యిపేట మహిళా గ్రంథాలయ అధికారి

గోదావరిలో మహిళ మృతదేహం

కంబాలచెరువు: గోదావరి నదిలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని శుక్రవారం పోలీసులు కనుగొన్నారు. స్థానిక మార్కండేయస్వామి గుడి సమీపంలో ఇసుక ర్యాంపు వద్ద సుమారు 50 నుం చి 55 సంవత్సరాలు వయసున్న మహిళ మృత దేహం తేలియాడుతోంది. దీనిని చూసిన స్థానికులు ఒకటో పట్టణ పోలీసులకు తెలిపారు. వారు వచ్చి మృతదేహాన్ని వెలికితీసి ఆధారాల కోసం పరిశీలిం చారు. ఆచూకీ లభించలేదు. దీంతో మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు.

ఘనంగా సప్తాహాలు

పెదపూడి: సీతారామచంద్రస్వామి సప్తాహాలు ఘనం గా జరుగుతున్నాయని పుట్టకొండ గ్రామ సర్పంచ్ వల్లు వెంకటరమణ అన్నారు. పుట్టకొండలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి ఆలయ ప్రాంగణంలో సీతారామచంద్రస్వామి ప్రథమ సప్తాహాలు ఏడో రోజు శుక్రవారం వైభవంగా జరిగాయి. ప్రముఖ పం డితులు పి.కమలాకర్, చంద్రమౌళి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో తెల్లవారు జామున స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.